క్లుప్తంగా

22 నుంచి ఉపాధి హామీ గ్రామసభలు

సంతమాగులూరు (అద్దంకి): ఉపాధి హామీ పనుల్లో భాగంగా 2022–23 సంవత్సరంలో నిర్వహించిన పనులకు సంబంధించి గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఏపీవో శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ నెల 22వ తేదీ నుంచి 29వ తేదీ వరకు గ్రామ సభలను ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల ఉపాధి హామీ సిబ్బంది వారికి కార్డులు అందుబాటులో ఉంచి సహకరించాలని తెలిపారు.

25న సర్వసభ్య సమావేశం

మేదరమెట్ల: కొరిశపాడు మండల సర్వసభ్య సమావేశం ఈనెల 25వ తేదీ ఉదయం 11 గంటలకు ఉంటుందని, ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులతో పాటు ప్రజా ప్రతినిధులు తప్పక హాజరు కావాలని ఎంపీడీవో సురేష్ బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

మార్టూరు సీఐగా అక్కేశ్వరరావు



సీఐగా బాధ్యతలు చేపట్టిన అక్కేశ్వరరావు

మార్టూరు: మార్టూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా వీ అక్కేశ్వరరావు శనివారం మధ్యాహ్నం బాధ్యతలు చేపట్టారు. గుంటూరు ట్రాఫిక్ సీఐగా విధులు నిర్వహిస్తున్న అక్కేశ్వరరావును మార్టూరు సీఐగా బదిలీ చేస్తూ కోస్టల్ రేంజ్ ఐజీ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐను ఎస్సై ఎం శ్రీనివాసరావు, స్టేషన్ సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.

బల్లికురవలో కుక్కల స్వైర విహారం



బల్లికురవలో కుక్కల స్వైర విహారం

బల్లికురవ: ఇటీవల బల్లికురవ నాలుగు రోడ్ల కూడలి, గ్రామంలో కుక్కల స్వైర విహారంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. సమూహాలుగా సంచరిస్తుండటంతో కొత్త వ్యక్తులు, చిన్నారులు, వృద్ధులు భయాందోళన చెందుతున్నారు. గత ఆరు మాసాల్లో వివిధ పనుల కోసం వచ్చిన వారు, గ్రామస్తులు సుమారు 20 మంది వరకు గాయాలపాలయ్యారు. ఇప్పటికైనా గ్రామ పంచాయతీ అధికారుల చొరవతో కుక్కలను అటవీ ప్రాంతాలకు తరలించాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

ఆటో బోల్తా, వ్యక్తికి గాయాలు



బోల్తా పడిన ఆటో పక్కనే ఉన్న క్షతగాత్రుడు

మేదరమెట్ల: ప్రైవేటు పార్శిల్ వాహనం బోల్తా పడి వ్యక్తికి గాయాలయ్యాయి. ఈఘటన కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల ఉత్తర బైపాస్ సమీపంలో శనివారం చోటు చేసుకుంది. అందిన వివరాల మేరకు.. విజయవాడ నుంచి కనిగిరికి ట్రాలీ ఆటో పార్శిల్‌తో వెళ్తోంది. ఈ క్రమంలో కొరిశపాడు ఫ్లైఓవర్ బ్రిడ్జి దాటిన తరువాత ఆటో అదుపు తప్పడంతో బోల్తా పడింది. దీంతో ఆటోలో ఉన్న క్లీనర్ కిరణ్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

న్యాయవాదుల కార్తీకమాస సమారాధన

చీరాల రూరల్: చీరాల బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కటకం చంద్రశేఖరరావు ఆధ్వర్యంలో శనివారం స్థానిక కోర్టు భవన సముదాయం వద్దగల నేషనల్ కాంపౌండ్‌లో న్యాయవాదులు, న్యాయమూర్తుల కార్తీకమాస సమారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సీనియర్ సివిల్ జడ్జి ఎం. సుధ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్ రెహానాలు పాల్గొన్నారు. న్యాయవాదులతో కలసి న్యాయమూర్తులు ఎంతో ఆనందంగా సహపంక్తి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని న్యాయవాదులందరిని కలుపుకుని సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేయడం మంచి పరిణామమని పేర్కొన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరవ రమేష్ బాబు, ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ రాజు వెంకటేశ్వర రెడ్డి, ఏపీపీలు, బార్ అసోసియేషన్ సభ్యులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

చదవడం అందరికీ ఇష్టంగా మారాలి



మార్టూరులో వ్యాసరచన పోటీలను పర్యవేక్షిస్తున్న ఉపాధ్యాయులు



బల్లికురవలో వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



కడవకుదురులో వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

మార్టూరు: చదవడం అనే వ్యాపకంతో లోకజ్ఞానం, ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని.. అన్ని వయస్సుల వారు చదవడాన్ని అలవాటు చేసుకోవాలని మార్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రూత్ మెర్సీ జాయ్ అన్నారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయుడు కత్తి శ్రీనివాసరావు, లైబ్రేరియన్ పీ జానకి రామారావు, ఆంజనేయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బల్లికురవ: చిన్నారులు బాల్యదశ నుంచే గ్రంథాలయాలకు వెళ్లి పుస్తకాలు చదవటం అలవాటు చేసుకుంటే మరింత విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని బల్లికురవ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కె. హనుమంతరావు అన్నారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక ఉన్నత పాఠశాలలో గ్రంథాలయాల ప్రాముఖ్యతపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. సోమవారం ముగింపులో భాగంగా బహుమతులు అందిస్తామని లైబ్రేరియన్ ఏ రమేష్‌బాబు తెలిపారు.

ఇంకొల్లు (చినగంజాం): విద్యార్థులు చిన్నతనం నుంచే పఠనాసక్తిని పెంపొందించుకుంటే విద్యలో ఉన్నత స్థితికి చేరుకోవచ్చని ఇడుపులపాడు విద్యాపరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పిడవర్తి పేరిరెడ్డి అన్నారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి నిత్యం అర్ధగంట సేపు విద్యార్థులు గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలను అలవాటు చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ అంబటి శకుంతల, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

- జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక పర్చూరులో బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులకు పద్యాల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం అశ్విని, లైబ్రేరియన్ జీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.
- జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా చినగంజాం మండలంలోని శాఖా గ్రంథాలయ పరిధిలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. మండలంలోని పెదగంజాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, కడవకుదురు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ ఏఎంఎల్ నరసింహాచార్యులు, పాఠశాల హెచ్‌ఎంలు కే రామారావు, ఎం దేవదత్తం, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చీరాల అర్బన్: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా శనివారం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. పోటీలలో పేరాలలోని ఏఆర్‌ఎం హైస్కూల్, గరల్స్ హైస్కూల్ విద్యార్థులు, వాసవీ, ఏకే అండ్ కే పాఠశాలల విద్యార్థులు మొత్తం 56 మంది పాల్గొన్నారు. పోటీల్లో విజేతలకు ఈనెల 20న జరగనున్న గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభలో బహుమతులు అందించనున్నట్లు లైబ్రేరియన్ డి.ధనమ్మ తెలిపారు.

చేతివృత్తులతో కుటుంబానికి ఆసరా



కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహశీల్దార్ సంధ్యశ్రీ

పర్చూరు (చినగంజాం): మహిళలు కుట్టు శిక్షణ ద్వారా చేతివృత్తులలో నైపుణ్యం సంపాదించి ఉపాధి పొందాలని తహశీల్దార్ కే సంధ్యశ్రీ అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ పర్చూరు సెంట్రల్, తానా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రాన్ని శనివారం మండల తహశీల్దార్ కే సంధ్యశ్రీ ప్రారంభించారు. స్థానిక భవనం వీరారెడ్డి రోటరీ భవనంలో తానా ప్రతినిధి కొల్లా అశోక్‌బాబు ఆర్థిక సాయంతో కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ శిక్షణ కోసం వచ్చిన మహిళలు శ్రద్ధగా తర్ఫీదు పొందాలన్నారు. సొంతంగా వృత్తి లో రాణించాలని, కుటుంబానికి ఆర్థికంగా అండగా ఉండి పలువురికి ఆదర్శంగా నిలవాలని కోరారు. క్లబ్ వృత్తి సేవ డైరెక్టర్ రావి సత్యనారాయణ మాట్లాడుతూ కుట్టు నేర్చుకునేందుకు అవసరమైన కుట్టు మిషన్‌లు, సామగ్రి రోటరీ క్లబ్ ఉచితంగా అందజేస్తుందని, అవకాశాన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ట్రైనర్ రాజ్యలక్ష్మి, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు నాగభైరు శ్రీనివాసరావు, బీ సదానందరెడ్డి, సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం



కార్యక్రమంలో మాట్లాడుతున్న దాత బ్రహ్మారెడ్డి

చీరాల అర్బన్: బత్తుల సర్వీస్ ట్రస్టు ఆధ్వర్యంలో పేద, ప్రతిభ గల విద్యార్థినులకు నగదు బహుమతులు అందించి ప్రోత్సహిస్తున్నట్లు ట్రస్టు వ్యవస్థాపకుడు, రిటైర్డు ప్రిన్సిపాల్ బత్తుల బ్రహ్మారెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీలో పేద, ప్రతిభ గల విద్యార్థినులకు రూ.8 వేల నగదు ప్రోత్సాహక బహుమతిని, పుస్తకాలను కళాశాలకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటితరం పుస్తక పఠనంపై ఆసక్తిని పెంచుకోవాలని, క్రమశిక్షణ కలిగిన ప్రవర్తనతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో రిటైర్డు ప్రిన్సిపాల్ ఎ.నాగవీరభద్రాచారి, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షులు జి.హరిహరరావు, సీనియర్ అధ్యాపకులు ఏవీ సుబ్బారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కార్తీక పౌర్ణమి స్నానాలకు ఏర్పాట్లు



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కరణం

- ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి

చీరాల: కార్తీక పౌర్ణమి సముద్ర స్నానాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తిచేయాలని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి అధికారులను ఆదేశించారు. శనివారం రాత్రి మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో నియోజకవర్గంలోని పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్టీసీ, ఫైర్, మెరైన్, మెడికల్ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని వాడరేవు, రామాపురం, కఠారివారిపాలెం సముద్ర తీర ప్రాంతాలకు కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని వేలాది మంది భక్తులు వస్తారన్నారు. వారికి అన్ని రకాల వసతులు తీరం వద్ద కల్పించాలన్నారు. మెరైన్, సివిల్ పోలీస్‌లు ప్రత్యేక బందోబస్తు నిర్వహించి గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలన్నారు. సముద్రంలో రెండు బోట్లతో పర్యాటకులు లోతుకు వెళ్ళకుండా హెచ్చరికలు జారీ చేస్తూ అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా, ప్రాణాప్రాయ స్థితిలోకి వెళ్లిన వారికి తక్షణ వైద్యసేవలందించేందుకు వైద్యసిబ్బంది, 108 సిద్ధం చేసి అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలని వైద్యశాఖాధికారులకు సూచించారు. తీరం వద్ద భక్తులు దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక సదుపాయాలు, శుద్ధ జలాన్ని ఏర్పాటు చేయడంతో పాటు తీరం మొత్తం విద్యుత్ కాంతులు వచ్చేలా హైమాస్ట్‌ఎల్ఈడీ బల్బులను ఏర్పాటు చేయాలన్నారు. భక్తుల వాహనాలను నిలుపుదల చేసేందుకు పార్కింగ్ సౌకర్యాన్ని కల్పించి తీరం మొత్తం పరిశుభ్రంగా ఉంచేలా పంచాయతీరాజ్ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. భక్తుల రవాణాకు ఇబ్బంది లేకుండా ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ సరోజిని, డీఎస్పీ ప్రసాదరావు, ఎలక్ట్రికల్ డీఈ జాన్ థామస్, ఆర్‌అండ్‌బీ డీఈ నరసింహులు, పంచాయితీరాజ్ డీఈ శేషయ్య, ఎంపీడీవో నేతాజీ, తహశీల్దార్లు ప్రభాకరరావు, అశోక్‌వర్ధన్, ఒన్‌టౌన్, టూటౌన్ సీఐలు శేషగిరిరావు, సోమశేఖర్, ఎస్సైలు జనార్ధ, సురేష్, మెరైన్ ఎస్సై సుబ్బారావు, ఫైర్ ఆఫీసర్ రామకృష్ణ, ఆర్టీసీ డీఎం జె. శ్యామలాకుమారి, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యురాలిపై కేసు నమోదు చేయాలని ఫిర్యాదు



సీఐ, ఎస్సైకి ఫిర్యాదు చేస్తున్న బాధితులు

అద్దంకి రూరల్: బాలింత మృతికి కారణమైన అద్దంకి సీహెచ్‌సీ వైద్యశాల డాక్టర్‌పై కేసు నమోదు చేయాలని మృతురాలి తండ్రి శీలం చంద్రశేఖర్, పెదనాన్న శీలం రవికుమార్‌లు శనివారం సీఐ రమేష్‌బాబుకు, ఎస్సై వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేశారు. గత నెల 30న కాన్పు కోసం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలలో చేరిన శీలం మెర్సీరాణి కాన్పు కష్టమై మరణించటానికి వైద్యశాల సిబ్బంది అలసత్వమేనన్నారు. డాక్టర్‌పై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించటానికి తగిన దర్యాప్తు జరిపించాలని, శవానికి పంచనామా చేయాలని సీఐ, ఎస్సైని కోరారు. కార్యక్రమంలో దళిత సంఘ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆర్బీకే చైర్మన్‌కు తీవ్రగాయాలు



ప్రమాదంలో గాయపడిన రమణారెడ్డి

చీరాల: రోడ్డు ప్రమాదంలో మండల వ్యవసాయ సలహా సంఘ అధ్యక్షుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈఘటన శనివారం సాయంత్రం చీరాల–ఒంగోలు 216 జాతీయ రహదారిపై రామాపురం వెళ్లే రోడ్డు వద్ద జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. శనివారం సాయంత్రం చీరాల మండల వ్యవసాయ సలహా సంఘ అధ్యక్షులు కావూరి రమణారెడ్డి తన ద్విచక్రవాహనంపై వస్తుండగా రామాపురం వెళ్లే రోడ్డు సమీపంలో ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ఘటనలో ఇరువురు రోడ్డుపై పడడంతో తీవ్రగాయాలయ్యాయి. రమణారెడ్డికి తీవ్ర గాయాలు కావడంతో పాటు స్పృహ కోల్పోయారు. సమాచారం అందుకున్న పోలీసులు క్షతగాత్రులను చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం ఒంగోలు సంఘమిత్ర హాస్పిటల్‌కు తరలించారు. ప్రమాదంలో గాయపడిన మరో వ్యక్తి చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు రూరల్ పోలీసులు ఘటనపై దర్యాప్తు చేస్తున్నారు.

శివ నామస్మరణలో శివాలయాలు

బల్లికురవ: శివకేశవులకు ప్రీతిపాత్రమైన కార్తీక మాసం సందర్భంగా ఆలయాలు శివనామస్మరణతో మార్మోగుతున్నాయి నక్కబొక్కలపాడు, కొనిదెన, వేమవరం, కొండాయపాలెం, చెన్నుపల్లి, ముక్తేశ్వరం, వైదన, కొప్పెరపాడు, కొమ్మినేనివారిపాలెం, అంబడిపూడి, గుంటుపల్లి గ్రామాల్లోని శివాలయాల్లో ఉదయం 5 గంటల నుంచే అభిషేకాలు, అమ్మవార్లకు కుంకుమ పూజలు చేపడుతున్నారు. వీటికి తోడు అయ్యప్ప, భవాని, శివమాల ధారులతో గ్రామాల్లో పండగ వాతావరణం నెలకొంది.

20న పెదనందిపాడులో నిరసన దీక్ష

పర్చూరు (చినగంజాం): గుంటూరు చానల్‌ను పర్చూరు వరకు పొడిగించే విషయమై ఈనెల 20వ తేదీ పెదనందిపాడులో నిర్వహించే నిరసన దీక్షను జయప్రదం చేయాలని నల్లమడ రైతు సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లా రాజమోహన్ అన్నారు. శనివారం స్థానిక ఆర్ అండ్ బీ అతిథి గృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గుంటూరు చానల్ పొడిగింపుతో 50 గ్రామాలకు సాగు, తాగు నీరు అందుతాయని ఆయన తెలిపారు. గుంటూరు చానల్‌కు ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేసి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు యార్లగడ్డ అంకమ్మచౌదరి, కోట హరిప్రసాద్, జీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: శోభకృతు నామ సంవత్సరం. దక్షిణాయనం, కార్తీక మాసం, శ్రవణం నక్షత్రం, షష్ఠి తిథి సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర శనివారం తెలిపారు. ఉదయం బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. స్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. ఆంజనేయ స్వామి ఉత్సవమూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు.

కందిపప్పు, ఉల్లిపాయలు అందించాలి

చీరాల అర్బన్: నిత్యావసర వస్తువులైన కందిపప్పు, ఉల్లిపాయలను సబ్సిడీపై ప్రజలకు అందించాలని కోరుతూ శనివారం భారతీయ జనతా పార్టీ చీరాల శాఖ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ ప్రజలకు నిత్యవసరమైన వస్తువులలో కందిపప్పు, ఉల్లిపాయలు ప్రభుత్వం సబ్సిడీపై ప్రజలకు అందించాలన్నారు. ధరల నియంత్రణల లేక ధరలు పెరిగిపోతున్నాయన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ అరవపల్లి కుమార్, పట్టణ అధ్యక్షులు శంకరశెట్టి నాగేశ్వరరావు, బాపట్ల జిల్లా కార్యదర్శి వెంకటేశ్వరరావు, కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు శవనం రామస్వామిరెడ్డి, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో సామగ్రి దగ్ధం

వేటపాలెం: విద్యుదాఘతంతో ఇంట్లో సామగ్రి దగ్ధమైంది. ఈఘటన శనివారం స్థానిక చేగూడివారిపాలెంలో దారా జోష్వరాజు ఇంట్లో సంభవించింది. అందిన వివరాల మేరకు.. ఇంట్లో విద్యుత్ సర్క్యూట్‌తో మంటలు రావడంతో ఇంట్లో వారందరూ బయటికి పరుగులు తీశారు. ఇంట్లో ఉన్న ఫ్రిజ్, ఏసీ, ఎల్‌సీడీ, టీవీ గృహోపకరణాలు, వంట సామగ్రి మంటల్లో కాలిపోయాయి. యజమాని దాచుకొన్న కొంతనగదు అగ్ని ప్రమాదంలో కాలిపోయింది. చీరాల నుంచి వచ్చిన అగ్నిమాపక వాహనం మంటలార్పివేశాయి.

శ్మశానానికి స్థలం కేటాయింపు



స్థల పత్రాలను గ్రామస్తులకు అందిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి ఆమంచి

పర్చూరు (చినగంజాం): మండలంలోని గర్నెపూడి ఎస్సీ కాలనీకి ప్రభుత్వం 60 సెంట్ల శ్మశాన స్థలాన్ని కేటాయించింది. దీనికి సంబంధించిన పత్రాలను శనివారం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ గ్రామస్తులకు అందించారు. కార్యక్రమంలో నాయకులు విష్ణుమూర్తి, ఆది నారాయణరావు, జ్యోతి లక్ష్మయ్య, పీ సుబ్బారావు, కాకుమాను రోశయ్య, తిరుపతి కుమారస్వామి, డీ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వెంకటేష్‌ను పరామర్శించిన మాచర్ల ఎమ్మెల్యే



వెంకటేష్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

చీరాల: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వైఎస్సార్ సీపీ చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌ను హైదరాబాద్‌లో ఆయన నివాసంలో ప్రభుత్వ విప్, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి శనివారం పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై ఆయనతో మాట్లాడారు.

సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో కృష్ణకుమారి

యద్దనపూడి: ప్రభుత్వం అందిస్తున్న ప్రతి సంక్షేమ పథకాన్ని ప్రజలకు తెలియాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఎంపీడీవో కృష్ణకుమారి సూచించారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో తహశీల్దారు రవి కుమార్ అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు, ఏఎన్‌ఎంలు, వీఆర్వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో స్వమిత్వ సర్వే, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, హౌసింగ్ నిర్మాణలపై అవగాహన కల్పించారు. అలాగే మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దారు విష్ణు, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఓటు నమోదుతో ప్రశ్నించే హక్కు



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఈఆర్వో

అద్దంకి : 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేసుకోవాలని ఈఆర్వో ఉమాదేవి అన్నారు. శనివారం స్థానిక హర్షిణి డిగ్రీ కళాశాలలో ఓటు హక్కుపై విద్యార్థులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఆర్వో మాట్లాడుతూ ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్యం మన దేశం అన్నారు. మరింత శక్తివంతమైన దేశాన్ని తయారు చేయాలంటే యువత ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. ఇందుకు ఓటరు నమోదు కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో తహశీల్దార్ జీవి సుబ్బారెడ్డి, డీటీ సుధారాణి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.